ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024

ఇద్దరు ఉపాధ్యాయులకు నోటీసులు

శ్రీకాకుళం అర్బన్ : సుదీర్ఘకాలం అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం మండలం లింగాలవలసలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న టి.కృష్ణారావు గతేడాది జనవరి ఒకటో తేదీ నుంచి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని తెలిపారు. అతనికి పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఇంతవరకు సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. నరసన్నపేట మండలం గెద్దవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న పి.గౌరీదేవి 2021 అక్టోబరు 18 నుంచి విధులకు గైర్హాజరైనట్లు తెలిపారు. వీరిద్దరూ పది రోజుల్లో డిఇఒ ఎదుట హాజరు కావాలని మరోమారు నోటీసు జారీ చేశారు. లేకుంటే విధుల నుంచి శాశ్వతంగా తొలగించనున్నట్లు స్పష్టం చేశారు.

బదిలీల బెంగ

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఇప్పటికే జిల్లాలో పర్యటనలు, అధికారిక సమీక్షలూ మొదలయ్యాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన ప్రతి సందర్భంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అప్పటివరకు పనిచేస్తున్న వారిని సాగనంపడం, తమవారిని, తమకు అనుకూలంగా ఉండే వారిని జిల్లాకు తీసుకురావడం సాధారణంగా జరిగే ప్రక్రియే. దీంతో తమకూ స్థానచలనం తప్పకపోవచ్చని జిల్లా నుంచి మండల స్థాయి ఉద్యోగుల్లో దాదాపు అన్ని శాఖల్లోనూ చర్చ నడుస్తోంది. మరోవైపు జిల్లా ఉన్నతాధికారులకూ బదిలీలు తప్పవనే ప్రచారం సాగుతోంది.

- స్థానచలనంపై అధికారుల్లో చర్చ
- జిల్లాకొచ్చేందుకు పాత వారు ప్రయత్నం
- ఇప్పటికే వంశధారలో బదిలీలు మొదలు
- మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పలువురు అధికారులకు బదిలీల బెంగ పట్టుకుంది. గత ప్రభుత్వ హయంలో జిల్లాకు వచ్చి ప్రాధాన్య పోస్టుల్లో నియమితులైన వారికి స్థానచలనం తప్పదంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఒక్రటెండు శాఖల్లో బదిలీల ప్రకియ మొదలైంది. వంశధార పర్యవేక్షక ఇంజినీరుగా ఉన్న డోల తిరుమలరావును విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇఇగా బదిలీ చేశారు. ఆ స్థానంలో విజయవాడ ఇరిగేషన్ విభాగంలో పనిచేస్తున్న బి.రాంబాబును ఎస్ఇగా నియమించారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో వంశధార ఎస్ఇగా పనిచేసిన ఆయన్ను తిరిగి తీసుకొచ్చారు. టెక్కలిలో వంశధార ప్రాజెక్టు డిఇఇ కె.శ్రీకాంత్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో బి.శేఖర్‌రావును నియమించారు. రానున్న రోజుల్లో మరిన్ని బదిలీలు ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. తమకు అనుకూలంగా ఉన్న అధికారులను నియమించుకుని, తమకు కావాల్సిన వ్యవస్థను చక్కబెట్టుకోవాలని కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. తమ సామాజిక తరగతికి చెందిన వారిని ఏరికోరి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



పాత స్థానంలో కొనసాగేలా పైరవీలు

బదిలీలు జరుగుతాయన్న చర్చ నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులూ తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. తమ పాత స్థానంలో కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడలో ఉన్న సమయంలోనే కొందరు అధికారులు ఆయన్ను ప్రసన్నం చేసుకున్నారన్న చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. పాతపట్నం డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్ శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సిఫార్సులతో నియమించారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అప్పుడు సామాజిక అస్త్రాన్ని ప్రయోగించిన జయప్రకాష్, ఇప్పుడు స్థానికతను ఉపయోగించుకుంటున్నారన్న చర్చ నడుస్తోంది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండలం కోటబొమ్మాళికి చెందిన వారు కావడంతో కలిసొచ్చినట్లు తెలుస్తోంది. మరో ఏడాది పాటు ఇక్కడే కొనసాగుతారనే చర్చ నడుస్తోంది.

బదిలీలపై అచ్చెన్న ముందుచూపు

బదిలీ విషయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. బదిలీ కోసం ఎమ్మెల్యేల నుంచి ఇబ్బడిముబ్బడిగా సిఫార్సులు వచ్చే అవకాశాలు ఉండడంతో జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. అధికారులందరినీ బదిలీ చేయలేమని, ఉన్న వారితోనే సిస్టమ్స్‌ను స్ట్రీమ్‌లైన్ చేద్దామని ఈనెల 18న జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన ముఖాముఖి సందర్భంగా ఎమ్మెల్యేలకు సూచించారు. ఇదే సందర్భంలో వంశధార ప్రాజెక్టులోని ఇద్దరు అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు బదిలీ చేసి తనకు కావాల్సిన అధికారులను రప్పించుకున్నారని, తమ దగ్గరకొచ్చేసరికి బదిలీలు వద్దంటూ సూచించడంపై పలువురు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు.

బదిలీల కోసం తహశీల్దార్ల నిరీక్షణ

ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన పలువురు తహశీల్దార్లు, ఎంపిడిఒలు విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు వారాలు గడుస్తున్నా, రాష్ట్రస్థాయిలో ఆ ఫైల్ కదలడం లేదు. దీంతో తమ సొంత ప్రాంతాలకు వచ్చేందుకు వారు నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి అమరావతిలో రెవెన్యూ అసోసియేషన్ అధికారులు కలిసి వినతిపత్రం అందించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

'నీట్'లో పెద్దఎత్తున అక్రమాలు

- పరీక్షను మళ్లీ నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్
- శ్రీకాకుళంలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ విమర్శించారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన విద్యార్థులు నగరంలోని అంబేద్కర్ జంక్షన్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్దఎత్తున అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నా, వాటిపై విచారణ చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తోందన్నారు. నీట్ అక్రమాలపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నా, న్యాయస్థానాలను ఆశ్రయించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)కు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ స్పందించి రెండుచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించామని అంగీకరించారని తెలిపారు. ఎన్‌టిఎను మెరుగుపర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారు తప్ప దీనిపై విచారణ చేయిస్తామని గానీ, అభ్యర్థులకు న్యాయం చేస్తామని గానీ చెప్పలేదన్నారు. నీట్‌లో అక్రమాలను సాధారణంగా చోటుచేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారు తప్ప కనీసం పశ్చాత్తాపం చెందడం లేదన్నారు. నీట్ స్కామ్‌ను కేంద్ర ప్రభుత్వం తొక్కి పెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. హర్యానాలో 67 మంది అభ్యర్థులకు 720 మార్కులు వచ్చాయని, అందులో ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు ఉన్నారని తెలిపారు. పరీక్షలను నిర్వహించిన ఎన్‌టిఎ పనితీరు లోపభూయిష్టంగా తయారైందని పేపర్ లీక్, ఇతర అవకతవకలు దీన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. నెట్‌లో చోటుచేసుకున్న అవకతవకలపై స్పందించి యుజిసి దాన్ని వెంటనే రద్దు చేసిందని, నీట్ పరీక్షను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, నేరస్తులను కఠినంగా శిక్షించి బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, కమిటీ సభ్యులు భూపతి, పవిత్ర, మోహిని, సాయి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుల బీభత్సం

- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు
- రెండు ఆవులు మృత్యువాత

వార్త... మెయిన్‌లో

బూర్జలో గురువారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. రెండు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. ఆవులు మేపేందుకు వెళ్లిన ఒకరిని, పొలంలో పనిచేసేందుకు వెళ్లిన మరొకరిని బలిగొంది. పిడుగుపాటుకు కటకమయ్యపేటకు చెందిన దేవరపల్లి బారికయ్య (72), అయ్యవారిపేటకు చెందిన చోడవరపు వెంకట సత్యనారాయణ (25) మృతి చెందారు. రెండు ఆవులూ మృత్యువాత పడ్డాయి.

బారికయ్య మృతదేహం

సత్యనారాయణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాను నియంత్రించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త వ్యక్తుల సమాచారం సేకరణ, అనుమానిత వ్యక్తులపై నిఘా, లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు క్రయవిక్రయాలు లేకుండా నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలన్నారు.

షార్ట్ ఫిల్మ్‌కు నగదు బహుమతి

మాదకద్రవ్యాల వినియోగం వల్ల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించేలా మూడు నిమిషాలు గల షార్ట్ ఫిల్మ్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను హెచ్‌డి క్వాలిటీలో 6309990940 వాట్సాప్ నంబరుకు ఈనెల 25వ తేదీ ఉదయానికి పంపించాలని సూచించారు. వచ్చిన షార్ట్ ఫిల్మ్‌లను ఎంపిక చేసి ప్రథమ బహుమతి రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి రూ.మూడు వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న 1కె సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించే అవగాహనా ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి

జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి చేశామన్నారు. ఎక్కడా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను ముగించామని తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో ఎఎస్‌పిలు జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వర్ రెడ్డి, ఎ.త్రినాథరావు, కె.శ్రీనివాస్, ఎల్.శేషాద్రి, ఎఒ గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులకు సూచించారు. వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్, సహకార, ఎపిఎంఐపి, వంశధార తదితర శాఖలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈసారి జిల్లాలో 1,82,325 హెక్టార్లలో పలు పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఇందులో వరి 1,61,500 హెక్టార్లు, మొక్కజొన్న 14000 హెక్టార్లు ప్రధానంగా సాగు చేయనున్నట్లు తెలిపారు. విత్తన పంపిణీకి సంబంధించి 38,882 క్వింటాళ్లకు గానూ 31,699 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అందులో 16,904 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. ఎరువులకు సంబంధించి 1,18,820 మెట్రిక్ టన్నులు జిల్లాకు కేటాయించడమైందని, ఇందులో 33,000 మెట్రిక్ టన్నులు ఇప్పటివరకు పంపిణీ కోసం సిద్ధం చేసినటుల తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా త్వరితగతిన రైతులకు ఇవ్వడానికి ప్రణాళిక పూర్తి చేశామన్నారు. గతేడాది జిల్లాలో రూ.8029 కోట్ల పంట రుణాలు రైతులకు ఇచ్చామని, ఈసారీ అర్హులైన రైతులందరికీ పంట రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పనుల వివరాలు, నీటి నిల్వ, ట్రిబ్యునల్ కేసుల ప్రస్తుత స్థితి గురించి సంబంధిత శాఖాధికారులు వివరించారు. మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటిని నిల్వ స్థితిని ఖరీఫ్ 2024-25 కార్యాచరణ గురించి చర్చించారు. పశు సంవర్ధకశాఖపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ పథకాలపై పాడి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పశువులకు వచ్చే జబ్బుల గురించి పశు వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల జెడిలు కె.శ్రీధర్, జయరాజు, వంశధార, నీటిపారుదల శాఖ ఎస్ఇలు రాంబాబు, పొన్నాడ సుధాకరరావు, మత్స్యశాఖ డిడి శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డిఎం రమణి, సెరీకల్చర్ అధికారి రాజేంద్రప్రసాద్ బాబు, ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్, మార్కెటింగ్ ఎడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొబైళ్లకు లాక్ తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మొబైల్ ఫోన్లు వాడే ప్రతిఒక్కరూ ఫోన్లకు లాక్ అండ్ సెక్యూరిటీ తప్పనిసరిగా వేసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. అందుబాటులో ఉన్న కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా ఫోన్లలో ఉండే డేటాకు సెక్యూరిటీ వేసుకోవాలన్నారు. జిల్లాలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 72 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన అనంతరం బిల్లు, ఐఎంఇఐ నంబరు, ఇతర వివరాలు భద్రంగా ఉంచుకోవాలన్నారు. విలువైన సమాచారాన్ని ఫోన్లు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. పోగొట్టుకున్న మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన సైబర్ సెల్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు డాట్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్) ఆధ్వర్యాన ఉన్న ceir.gov.in వెబ్‌సైట్‌లో పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి పొందేందుకు బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు.

మొబైల్ ఐఎంఇఐ నంబర్లు బ్లాక్ అయిన తర్వాత ఆ రిక్వెస్ట్‌ను తాము రిసీవ్ చేసుకుని, ఆ మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేశాక అన్‌బ్లాక్ చేసి మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తికి ఇస్తున్నట్లు తెలిపారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 202 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. జిల్లా పోలీస్ వెబ్‌సైట్ www.srikakulampolice.inలో జిల్లా ప్రజల కోసం అందుబాటులో ఉంచిన లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఇప్పటివరకు 244 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.64 లక్షల విలువ గల 518 ఫోన్ల వరకు రికవరీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది రమేష్, శేషగిరి, శరత్, అరవింద్, సత్యనారాయణ, సుధీర్ పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఆయుష్, ఎన్‌వైకె సంయుక్తంగా ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ఒత్తిడి తగ్గి శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ మాట్లాడుతూ యోగాపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఆయుష్ శాఖ ఆధ్వర్యాన పోస్టర్లు, స్టిక్కర్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తొలుత యోగా డే పోస్టర్‌ను డిఆర్ఒ గణపతిరావుతో కలిసి జెసి ఆవిష్కరించారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, డిఇఒ కె.వెంకటేశ్వరరావు, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త వెంకట్ ఉజ్వల్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సిఎస్‌పి రోడ్డు పనులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం - ఆమదాలవలస సిఎస్‌పి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. అమరావతిలో ఆర్అండ్‌బి మంత్రి బి.సి జనార్థన్ రెడ్డిని గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎస్‌పి రహదారి దుస్థితిని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ రహదారి అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేసినా, తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో పనులు పూర్తికాక నిలిచిపోయాయని చెప్పారు. గత ఐదేళ్లలో ఈ రహదారిపై పలు ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడ్డారని తెలిపారు. తక్షణమే ఈ రహదారి పూర్తికి సహకరించాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సంబంధిత రహదారి కాంట్రాక్టర్‌తో రవికుమార్ ఫోన్‌లో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్లులు సకాలంలో అందేలా తాను బాధ్యత తీసుకుంటానని భరోసానిచ్చారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

గ్రామస్థాయి నుంచి పారిశుధ్య పనులు

- మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామస్థాయి నుంచి పారిశుధ్య పనులు ప్రారంభించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మలేరియా నిర్మూలన మాసోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుధ్యంపై డిపిఒ, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య పరిస్థితులు బాగుంటే సీజనల్ వ్యాధులు ఉండవని చెప్పారు. మలేరియా పాజిటివ్ కేసులు గుర్తిస్తే తక్షణమే ఆ గ్రామాలు, వార్డుల్లో ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ఇటీవల పలాస మున్సిపాలిటీలో ఒకటి, మందసలో ఒకటి మలేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. గతేడాది 54 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆరు కేసులు వచ్చాయని చెప్పారు. పొందూరు, రణస్థలం, సింగుపురం, కొర్లాం, శ్రీకాకుళం, హిరమండలంలో ఒక్కో కేసు నమోదైందన్నారు. గతేడాది 11 మలేరియా కేసులు నమోదైతే, ఈ ఏడాది ఇప్పటివరకు రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేసులు నమోదైన ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేస్తున్నట్లు చెప్పారు. శుక్ర, శని, ఆదివారాల్లో డ్రై డేగా పాటిస్తున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఐదు లక్షల గంబూషియా చేపలు అవసరమని డిఎంఒ తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ ప్రసాదరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.జె బెన్హర్, డిపిఒ వెంకటేశ్వరరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: SRIKAKULAM
I.P.21/2022

Between:
Sri Sakalabaktula Prasad Rao ...Petitioner
And:
Gudla Narayana Murthy & 32 others ...Respondents

NOTICE

To,
R-7:D.Naagu, father name not known, R/at Hiramandalam Village & Mandal, Srikakulam District.
R-21:N. Venkata Reddy, father name not known, R/at Hiramandalam Village & Mandal, Srikakulam District.
R-23:Tamalampudi Latchareddy, father name not known, R/at Hiramandalam Village & Mandal, Srikakulam District.
R-32:Sali Thaviti Naidu, father name not known, R/at L.N. Peta Village & Mandal, Srikakulam District.

Please take notice that the above named petitioner has instituted the above I.P. against the above mentioned Respondent sand the matter stands posted to **28-06-2024** for your appearance. Therefore, if you have any objections in this regard attend before the above mentioned Court on the said date at **10:30 A.M** either in person or through an Advocate else the matter will be heard and determined in your absence as per law.

(By Order of the Hon'ble Court)
R. MADHUSUDAN RAO, Advocate
Visakhapatnam, Cell: 9989632727.

విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం


పొందూరు : కిట్లను పంపిణీ చేస్తున్న రామ్మోహన్

ప్రజాశక్తి- పొందూరు

విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణలు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని ఎపి మోడల్ స్కూల్, కెజిబివి, మహాత్మా జ్యోతిభాపూలే, లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావు, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, బలగ శంకరభాస్కరరావు, అనకాపల్లి చిన్నరంగా, మద్దెల శ్రీను, లోలుగు వెంకట్, కామరాజు, చోళ్ల శ్రీను, ఆదినారాయణ, కాలెపు శ్రీను, ప్రిన్సిపాళ్లు హెచ్.ప్రభాకర్, ఆర్.సౌమ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలోని కొత్తకోట, రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబల్ల రాంబాబు, తాడేల వెంకటరమణ, రాజారావు, సురవరపు జగదీశ్వరరావు, ఎంఇఒ బాలరాజు శ్రీనివాసరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావులు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే మండలంలోని కట్యాచార్యులపేటలో ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ చీమలవలసలో సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, నిమ్మతొర్లాడలో మాజీ వైస్ ఎంపిపి వండాన ఉదయ్ కుమార్ కూడా పాఠ్యపుస్తకాలను, బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలినాయుడు, పేడాడ కృష్ణారావు, బొడ్డేపల్లి సురేష్, హనుమంతు సత్యనారాయణ, కె.రాఘవాచార్యులు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని గురుగుబెల్లి పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ బి.కళ్యాణి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే తామడ జెడ్‌పి పాఠశాలలోనూ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.లక్ష్మణరావు, చిట్టిబాబు, హరికృష్ణ, మాజీ సర్పంచ్ బి.రాంబాబు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినవంక పాఠశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలను సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ బడుల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మారావు, మదనాల సింహాచలం, ఇరోతు రాంకీ, నగేష్, కొంచాడ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

పలాస : సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలతో రెవెన్యూ ఉద్యోగులు సత్సంబంధాలు కొనసాగించి సక్రమమార్గంలో సేవలందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, విశ్రాంత ఆర్‌డిఒ పి.ఎం.జె.బాబు, విశ్రాంత తహశీల్దారు రవీంద్రనాథ్ చంద్రశేఖర్, జి.సురేష్, పి.రాంబాబులను సన్మానించారు. కార్యక్రమంలో అంపోలు మాజీ సర్పంచ్ గొండు వెంకటరమణమూర్తి, తహశీల్దార్ బి.వి.రాణి, డిటి బి.వి.వి.ఎన్.రాజు పాల్గొన్నారు.

అలాగే రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జెండాను సంఘం అధ్యక్షులు కె.శ్రీరాములు ఎగురవేశారు. అనంతరం విశ్రాంత తహశీల్దార్లు ఎం.వి.సూర్యనారాయణ, జల్లెపల్లి రామారావు, ఎం.కాళీప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్‌చక్రవర్తి, మురళీధర్ నాయక్, డి.పద్మావతి, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు, పలాస డివిజన్ అధ్యక్షులు ఆర్.రామారావు, టెక్కలి డివిజన్ కార్యదర్శి ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

పలాస : రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులు విధులపై అవగాహన ఉండాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. రెవెన్యూ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు ఆర్‌డిఒ, తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ జె.సూర్యనారాయణ, విశ్రాంత తహశీల్దార్ రామారావుకు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో డిటిలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ మండల సర్వేయర్ గిరిప్రసాద్, ఆర్‌ఐ నిరంజన్, విఆర్‌ఒలు పోలాకి సోమేశ్వరరావు, కంచరాన ఖగేశ్వరరావు, సురేష్‌కుమార్, ప్రసాద్, కళ్యాణి, సంతోష్, రాజేష్

వజ్రపుకొత్తూరు : రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులను తహశీల్దార్ ఎం.సురేష్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పవిత్ర, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కవిటి: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరిస్తూ, ప్రజలకు రెవెన్యూ సేవలు చేరువచేయాలని సూచించారు. అలాగే పాత పద్ధతిలోనే వన్ బి, అండగల్ తదితర సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిటి రామచంద్రరావు, ఆర్‌ఐ రమణమూర్తి, మండలంలోని విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాలనరసాపురంలో కొట్లాట

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని నరసాపురం పంచాయతీ మాలనరసాపురంలో గురు వారం ఇరు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాటలో మహిళ తలకు గాయమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దళిత మహిళ ఎడ్ల ఈశ్వరిఉదయం కిరాణా షాప్‌కు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఆవాల సంతు, ఆవాల గోపి, ఇచ్ఛాపురం ఆనందరావు, చిన్ని శ్రీను, బి.మహాలక్ష్మి, బి.సుబ్బారావులు కలిసి ఆమెకు కులం పేరుతో దూసించి దాడి చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి వచ్చిన మరో మహిళ జామి భారతపై బండరాయితో దాడి చేసి తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించారు. అలాగే అవాల మహాలక్ష్మి, ఎడ్ల ఈశ్వరి గ్రూపునకు చెందిన వారు తమపై దాడి చేశారని బుడ్డ మహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరు గ్రూపులనకు చెందిన వారు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.సిద్ధార్థ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరుకులను పంపిణీ చేస్తున్న జనసైనికులు

పూరిల్లు దగ్ధం

పొందూరు: మండలంలోని కొంచాడ పంచాయతీ లుట్టపేటలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. యువకులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన టి.గోపి ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న యువకులు స్పందించి తాటికమ్మలను తొలగించారు. దీంతో పక్క ఇళ్లకు మంటలు అంటుకోకుండా ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో టివి, ఇంటి సామగ్రి కాలిబూడిదయ్యాయి.

జనసైనికులు సాయం

బాధితురాలు కట్టుబట్టలతో రోడ్డున పడడంతో జనసైనికులు అండగా నిలిచారు. బాధితులైన గోపి కుటుంబానికి 25 కేజీల బియ్యం ప్యాకెట్, నిత్యవసర సరుకులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ జనరల్ సెక్రెటరీ కొంచాడ చిన్నంనాయుడు, జిల్లా కార్య నిర్వహణ కమిటీ సభ్యులు గార బాబూరావు, ముల్లు హరినాథ్, జమాన అప్పలనాయుడు, శివ, గోవింద, తరుణ్, గణ, బాలు, సురేష్, సంతోష్, చిన్న పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతులకు శాపం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మానవ మనుగడకు ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ మండిపడ్డారు. పార్టీ పేరులో రైతును వెనుక బెట్టిన విధంగానే రైతాంగ సంక్షేమాన్ని చిట్టా చివరికి నెట్టేశారని ఆరోపించారు. మండల పరిధిలోని చింతాడ వద్ద వంశధార కుడి ప్రధాన కాలువ ఎత్తి పోతల పథకాన్ని ఆయకట్టు రైతులతో, టిడిపి నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రధాన కాలువను అనుసరించి అంపోలు వరకు పర్యటించిన కాలువ పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలువ పనుల పరిశీలన గురించి ముందుగానే సమాచారం ఇచ్చినా సంబంధిత ఉన్నతాధికారులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి వెన్నుముఖ లాంటి రైతు నడ్డివిరిచే విధంగా గత వైసిపి ప్రభుత్వం వ్యవహరించిందని అన్నారు. గ్రామీణ, గార మండల శివారు భూములకు నీరందించే వంశధార కుడి ప్రధాన కాలువ నిర్వహణ గాలికి వదిలేశారని విమర్శించారు. రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శివారు భూములకు సాగు నీరందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాత పద్ధతిలోనే అమలు చేయాలి

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాలలో గతంలోవలే 3,4,5 తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీకి వచ్చారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ పాఠశాలలో ఒకటి తరగతి నుంచి ఊదో తరగతి వరకు తరగతులు నిర్వహించే వారని, గత ప్రభుత్వం 3,4,5 తరగతుల విద్యార్థులకు జిల్లా పరిషత్ పాఠశాలకు పంపించి అందులో విలీనం చేశారని వివరించారు. దీంతో విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లేందుకు దూరమవుతుందని అన్నారు. రమేష్ స్పందించి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకోళ్తానని హామీనిచ్చారు. అంతకుముందు విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంగి రమణ, మజ్జి కృష్ణారావు, తంగుడు సునీల్, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

మున్సిపల్ కమిషనర్ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార లాభాపేక్షతో కొందరు వ్యక్తులు వేసిన అనధికార లేఅవుట్లపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రవి ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు మెట్టెక్కివలస సర్వే నంబరు 147 పిలో వేసిన లే అవుట్ అనధికారికంగా వేశారని తెలిపారు. ఈ లేఅవుట్‌కు మున్సిపల్ డిటిసిపి, సుడా నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని తెలిపారు. ఇటువంటి అనాధికార లేఅవుట్‌లో స్థలాల అమ్మకాలు కొనుగోలు చట్టరీత్యా నేరమని, అటువంటి స్థలాలను క్రయ విక్రయాలు జరిపి ఎవరైనా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్ట నిబంధనల మేరకు కూల్చివేతలు వేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. మండలంలోని బోరుభద్రలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం జరక్కుండా ప్రతిఒక్కరూ తమ వంతుగా పాటుపడాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చు అని పేర్కొన్నారు. మండల న్యాయ సంఘం ద్వారా ఉచిత న్యాయ సలహాలు అందిస్తారని స్పష్టం చేశారు. అనంతరం బోరుభద్రలో మెడికల్ క్యాంపు ప్రారంభించారు. డాక్టర్లు ఎల్.సంధ్యారాణి, పి.స్వాతిలు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, సర్పంచ్ బి.లక్ష్మీకాంతం, చింతాడ చిన్నారావు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమసమాజ స్థాపనకు రామోజీరావు తన కలంతో అక్షర సేద్యం చేశారని, ఆయన మృతి సమాజానికి తీరని లోటని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నాగవళి హోటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు సమస్మరణ సభ గురువారం నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిజంలో నూతన ఒరవడిని తీసుకొచ్చి అనేక రంగాలను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్, మైలిపల్లి నరసింహమూర్తి, ఇప్పిలి తిరుమలరావు, జెసిఐ అధ్యక్షులు బెందాళం వరలక్ష్మి, దూసి సంతోష్, శిల్లా మణి, నటుకుల మోహన్ పాల్గొన్నారు.

సాగునీరు అందేనా?

గుర్రపుడెక్కతో నిండిన మదనగోపాలసాగరం

ప్రజాశక్తి- టెక్కలి

ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో సాగునీరు అందించే మదనగోపాలసాగరంలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఏటా వంశధార ప్రధాన ఎడమ కాలువ 48 ఆర్ కాలువలో సిల్ట్‌తీత పనులు కొన్నేళ్ల నుంచి చేపట్టడం లేదు. దీంతో గుర్రపుడెక్కతో కాలువ పూర్తిగా నిండిపోయింది. వంశధార నీరు విడిచిపెట్టినా కాలువలో గుర్రపుడెక్క నిలిచిపోవడం, దీనికితోడు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది. స్థానిక ఆదిఆంధ్రావీధి వద్ద నుంచి మదనగోపాలసాగరంలోకి నీరు చేరేవరకు ఉన్న వంశధార ఎడమ కాలువలో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఏటా వేసవి సమయంలో ఈ పనులు చేడితే వర్షాలు ఆరంభమైన సమయంలో కాలువలో నీటి నిల్వలు ఉంటాయి. దీనికి తోడు వంశధార నీరు విడిచిపెట్టడంతో వ్యవసాయానికి అవసరమైన సాగునీరు లభ్యమయ్యే అవకాశాలుంటాయి. కానీ, ఈసారి ఇటువంటి పనులు ఏవీ చేపట్టకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయానికి వంశధార కాలువల నుంచి సాగునీరు ప్రవహిస్తుందా? అనే సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన వర్షాలు ఆరంభం కాక ముందే వంశధార కాలువలో సిల్ట్‌తీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

డిప్యుటేషన్లను రద్దు చేయాలని వినతి

పరిశీలిస్తున్న ఎంఇఒ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీలో ఉన్న చిన్నికృష్ణాపురం ఎంయుపి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు పంపించారని, వారిని వెంటనే వెనక్కి తీసుకువచ్చి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఎంఇఒ జి.రాజేంద్రప్రసాద్ గురువారం చిన్నికృష్ణాపురాన్ని సందర్శించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని పాఠశాల స్థితిగతులపై వివరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఏడో తరగతి వరకు విద్యాబోధన చేసేందుకు మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు, 75 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. గతేడాది డిప్యూటేషన్ పేరుతో ముగ్గురు ఉపాధ్యాయులను ఇక్కడి నుంచి పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు పంపించేశారని అన్నారు. ఈ నెల13న పాఠశాలల పున్నప్రారంభం కాగా, ఇక్కడి స్కూల్‌కు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేశారని, కానీ ఇదే పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకు రాలేదని ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఇఒ స్పందించి వారం రోజుల్లో పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆధ్వర్యాన పూర్వ జనరల్ సెక్రటరీ తారకానాథ్ 20వ వర్ధంతి వేడుకలు నగరంలోని రీజనల కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది ఎస్‌బిఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ముందుగా రీజనల్ సెక్రెటరీ కెసిహెచ్ వెంకటరమణ, రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీబ్ అమీర్, రీజనల్ సెక్రెటరీ పొన్నాడ కృష్ణకిషోర్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావులు ప్రారంభించారు. తారకానాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. బ్యాంకు పురోభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం బ్యాంకులో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు సురేష్, నాగరాజు, జవహరిని, వసంత, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రం అందజేస్తున్న కామేశ్వరరావు

యోగాతో ఆరోగ్యం

పలాస : ప్రతిఒక్కరికీ యోగా చేయడం అవసరమని, యోగా ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని, తప్పకుండా హాజరు కావాలని కన్వీనర్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి ఆర్‌డిఒను కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

సిబ్బందితో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

వసతిగృహం పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడలో ఉన్న బిసి వసతిగృహం లోపభూయిష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు వసతిగృహాన్ని గురువారం పరిశీలించారు. ఈ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించిన భోజనాన్ని రుచి చూసి అసహనం వ్యక్తం చేశారు. వసతిగృహంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్ పనితీరుపై విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు చేశారని, దీంతో పరిశీలించానని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని అన్నారు.

మెరుగైన బోధనకు చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ ఎఎంఒ గుంట లక్ష్మీనారాయన అన్నారు. స్థానిక మెయిన్ బజారు పాఠశాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 90 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో వివిధ రకాల అంశాల్లో విద్యార్థుల స్థాయిలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నరావు, మండల రీసోర్సు సిబ్బంది రవి, సంతోష్ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో శంకరరావు

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి- కవిటి

కవిటి నుంచి సముద్ర తీరం వైపు వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని బొరివంకకు చెందిన బల్లెడ శంకరరావు రూ.12 వేలు విలువ చేసే రెండు లోడ్లు చిప్స్ అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం శ్లాబ్ దశకు చేరుకుందని, పనులు వేగవంతం చేసేందుకు దాతల సహాయం అవసరమని అన్నారు. దాతల సహకారంతో పూర్తిస్థాయిలో వేగవంతంగా ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

కుటుంబ అవసరాలకు ఉపయోగించాలి

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి గొర్లె రాజు ఏప్రిల్ నెలలో ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలోని సహాచర హోంగార్డులు స్వతహాగా అందరూ కలిసి ఒక్కరోజు గౌరవ వేతనాన్ని రూ.4.17 లక్షలు సేకరించారు. సంబంధిత చెక్కును ఎస్‌పి జి.ఆర్.రాధిక చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నగదును భవిష్యత్, కుటుంబ అవసరాల మేరకు ఉపయోగించుకోవాలన్నారు. ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, ఆర్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న రవికుమార్

ఆమదాలవలస : ప్రతిఒక్కరూ బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ సిహెచ్. రవికుమార్ అన్నారు. పట్టణంలోని సాయినగర్‌లోని వెంకటేశ్వర ఐటిఐ విద్యార్థులకు బ్యాంకింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేర్చబడాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్, ఎ.హరనాథ్, సిహెచ్.వెంకటేష్ ఎం.రామారావు, వెంకటేశ్వర ఐటిఐ డైరెక్టర్ కూన భానోజీరావు పాల్గొన్నారు.

ముగిసిన పర్యావరణ వారోత్సవాలు

మాట్లాడుతున్న హెచ్‌ఎం రమణమ్మ

ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.రమణమ్మ అధ్యక్షతన పర్యావరణ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. క్లస్టర్ కో-ఆర్డినేటర్ గగన కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సుస్థిర ఆహార వ్యవస్థ- శక్తి వనరుల, సద్వినియోగం, నీటి యాజమాన్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం, వ్యర్థ నిర్వహణ అనే పర్యావరణ హిత అంశాలపై అవగాహన కల్పించారు.

వరి విత్తనాల పంపిణీ

పొందూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మణెమ్మ

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం రాయితీపై అందజేసే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ అన్నారు. మండలంలోని తాడివలసలో రైతులకు గురువారం వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. అలాగే పారిశుధ్య పనులను, మురుగు కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు. తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల కిట్లను అందజేశారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, ఉప సర్పంచ్ తిర్లంగి చలపతిరావు, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు, తమ్మినైన పూర్ణారావు, సీపాన భాస్కరరావు, మెట్ట శ్రీనివాసభట్లు, తమ్మినైన అమ్మినాయుడు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని చినంచలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన గురువారం రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పినకాన తిరుమలరావు, పైల విష్ణుమూర్తి, ఆరియాపల్లి ప్రభుదాస్, కాశీ మార్కండేయులు, కంచరణ మధు, చపర తిరుపతి, సత్తారు సురేష్, బమ్మిడి సురేష్, కంచరనా జగన్, బొచ్చ నీలాచలం, తుంబయ్య, కిల్లి భానుమూర్తి పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

సన్మానిస్తున్న నాయకులు

లావేరు : రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడునుఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు నాయకులు పల్లంట్ల వెంకట రామారావు ఆధ్వర్యాన కోటబొమ్మాళి మండం నిమ్మాడలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ దుశ్శాలువ కప్పి సన్మానించారు. తెలగ కార్పొరేషన్‌కు ఏర్పాటు కృషి చేస్తామని మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, విక్రమ్, జగన్నాథం, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ సూపర్‌వైజర్లతో పారిశుధ్యంపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పారిశుధ్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారని అన్నారు. దాని మెరుగుపరిచే బాధ్యత మీదేనన్నారు. ప్రతి వార్డులోనూ చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రోజూ బ్లీచింగ్ వేసి శుభ్రపర్చాలన్నారు.

పవన్‌ను కలిసిన దుర్గారావు

పలాస : మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌ని పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పొత్తులో భాగంగా చాలా మందికి ఎన్నికల పోటీ చేసే అవకాశం కల్పించలేకపోయామని, అయినా మీరందరూ శక్తి వంచన లేకుండా రాత్రింభవళ్లు కష్టపడి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో శ్రమించి పని చేసిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పించి ప్రజా సేవలో భాగస్వాములు చేస్తామని హామీ ఇచ్చారు.

పవన్‌ను సన్మానిస్తున్న దుర్గారావు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మెళియాపుట్టి : పారిశుధ్య పనులను చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పరశురాంపురం పంచాయతీ ఎర్రగడ్డలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువలను శుభ్రం చేసి చెత్తా చెదారాలను తొలగించారు. బోరు ప్లాట్ ఫారం వద్ద, వీధుల్లో, కూడళ్లలో చెత్తను తొలగించి బ్లీచింగ్ చేశారు. ఈ పనులను స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, వైస్ ఎంపిపి సవర రాజుతో కలిసి కార్యదర్శి శివాజీ, ఎంపిటిసి మాజీ సభ్యులు మోహనరావు, ఉప సర్పంచ్ సవర రమేష్, లక్ష్మీపురం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజం సాధ్యమని పిఎసిఎఎస్ మాజీ ఛైర్మన్, సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి అన్నారు. మండలంలోని చినవంక పంచాయతీ గుల్లలపాడులో పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. వీధులను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డిక్కల తిరుమలరావు, బగాది రాజారావు పాల్గొన్నారు.

రణస్థలం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని తెప్పలవలస పంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో చెత్తచెదారాలను తొలగించారు.

ఆమదాలవలస : మండలంలోని బెలమాం వీధుల్లో, కాలువల్లో పేరుకుపోయిన చెదారాలను సర్పంచ్ కనుగుల కిషోర్ అధ్యక్షతన తొలగించారు. అనంతరం క్లోరినేషన్ చేపట్టారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అందరి సహకారంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి మరమ్మతు పనులకు ప్రజలు అధికారులు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి మరమ్మతు పనులను రాగోలు, వాకలవలస సమీపంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం రైల్వే స్టేషన్‌కు చేరుకునే ప్రధానమైన రోడ్డు అధ్వన్నంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లాకు తొలిసారి వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. వారి ఆదేశాల మేరకు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బడికి పోదాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాభోధన అందిస్తుందని ఎంఇఒ మల్లారెడ్డి పద్మనాభరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మనం బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు. ఒక మంచి విద్యార్థిగా సమాజంలో రాణించగలరన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రఘుపతి, మమత, ఖగేశ్వరరావు, జీవరత్నం, సిఆర్‌పి ఎన్.సవరయ్య పాల్గొన్నారు.

పూర్వవైభవం తీసుకురావాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గత ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలు వల్ల మీ సేవా కేంద్రాలకు పనులు లేకుండా పోయాయని, దీంతో మేము రోడ్డున పడ్డామని, మళ్లీ మీ సేవా కేంద్రాలకు పూర్వపు వైభవం తీసుకురావాలని కోరారు. మండలంలోని నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి పలు ప్రభుత్వ సేవలు ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అందించామని అన్నారు. సచివాలయ వ్యవస్థ తరువాత రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్.రాజశేఖర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు

సమావేశంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

భవిష్యత్ కార్యాచరణపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి

కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పంచాయతీల పరిధిలో కూడా మార్పులు శర వేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మండలంలోని కుసుంపురంలో కూటమి శ్రేణులు, సచివాలయం సిబ్బంది గురువారం సమావేశమయ్యారు. పంచాయతీలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి చర్చించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవచేయాలని నిర్ణయించారు. సమావేశంలో పంచాయతీలోని కూటమి శ్రేణులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవ్వాలని బెంతు ఒరియాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డల భవిష్యత్, భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 176వ రోజు గురువారానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. అందుకే తమకు గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్తుకు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్యాట్లను అందజేస్తున్న రామ్మూర్తి

క్రికెట్ కిట్లు అందజేత

లావేరు : మండలంలోని గుమ్మడాం పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన యువతకు టిడిపి నాయకుడు మజ్జి రామ్మూర్తి గురువారం క్రికెట్ కిట్లును అందజేశారు. యువత విద్యతో పాటుగా క్రీడల్లోను రాణించాలన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్న ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జగ్గురోతు దుర్గాప్రసాద్, దుర్గాి వినోదకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

పోలాకి: తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉత్తమ సేవలు అందించే రైతులకు ఆహ్వానించి దుశ్శాలువ కప్పి సన్మానించారు. రైతులు ప్రాధాన్యత, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమం లో తహశీల్దార్ ప్రసాదరావు, డిటి శ్రీనివాసరావు, ఆర్‌ఐ సతీష్, సర్వేయర్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అరసవల్లికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి విశాఖ నగరానికి చెందిన కె.వి. సత్యనారాయణ రాజు రూ.లక్ష విరాళంగా అందజేశారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయా న్ని సందర్శించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తిని కలిసి చెక్కును అందజేశారు. ఆలయ ఇఒ చంద్రశేఖర్ వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

వేషధారణలో చిన్నారులు

ఘనంగా అంబికాదేవి సంబరాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లిలో అంబికాదేవి, మంకినమ్మ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఘటాలతో ఆలయాలు వరకు ఊరేగింపుగా వెళ్లారు. దీంతో వీధులన్నీ యాత్రికులతో కిటకిటలాడాయి. యువత, జనసైనికులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు.

భువనేశ్వరి జన్మదినం

పాతపట్నం : సిఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్‌టిఆర్ ట్రస్టు ఛైర్మన్ నారా భువనేశ్వరి జన్మదినం వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఐదు మండలాల అధ్యక్షులు కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్, అభిమానులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

పోలాకి: మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పోలాకి, గంగివలస, ఈదులవలస ప్రభుత్వ వసతిగృహాల్లో డాక్టర్ నల్లి రవికుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి, మలేరియా వ్యాధి పరిశోధకులు ఆధ్వర్యాన గురువారం స్ప్రేయింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాధిని వ్యాప్తి చేసే అనాఫిలిస్ దోమల నియంత్రణకు ఐఆర్‌ఎస్ (ఇండోర్ రెసిడెన్ స్ప్రేయింగ్) సరైన మార్గమన్నారు. ఎసిఎం (ఆల్ఫా సైపర్ మెత్రిన్) అని కీటక నాశన మందు వసతిగృహాల్లో దోమలు పెరగకుండా స్ప్రే చేశామని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

నందిగాం: మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.గున్నయ్య అధ్యక్షతన 16 మంది విద్యార్థులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి ఒకటో తరగతిలో చేర్పించారు. అనంతరం 80 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, కుమారి వనతి, పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ బొంప లక్ష్మి, బి.శంకరరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న రాజు

రాజీకి సహకరించాలి

టెక్కలి : ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు రాజీకి సహకరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి కోరారు. కోర్టు ఆవరణలో పోలీస్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదాలత్‌లో ఎక్కు వ శాతం క్రిమినల్ కేసులు రాజీ జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసుల్లో ఇరు పార్టీలు అంగీకారంతో పరిష్కరించుకోవాల న్నారు. సమావేశంలో ఎపిపి హరిప్రియ, బార్ అసోసి యేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద పాల్గొన్నారు.

వాకర్సు చేయూత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో వాంబే కాలనీకి చెందిన పేద విద్యార్థి చింతగడ దివ్యశ్రీ ఇంటర్మీడియేట్ పరీక్షల్లో 979 మార్కులు సాధించి జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 3,700 ర్యాంకు సాధించింది. అయితే ఆమె ఉన్నత చదువులు చదువుకునే ఆర్థిక స్తోమత లేక చదువు దూరం కావాలని భావిస్తోంది. విషయం తెలుసుకున్న స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆమె ఉన్నత చదువులకు ఆర్థికంగా తమవంతు సాయ పడాలని నిర్ణయించుకున్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆమెకు భరోసా కల్పిస్తూ రూ.15 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. ఉన్నత చదవుకు అవసరమైన సాయాన్ని ప్రభుత్వం నుంచి అందించడానికి తమ వంతు కృషి చేస్తామని, అధైర్యపడవద్దని ఆమెకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్సు ప్రతినిధులు బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, ఎస్.జోగి నాయుడు, జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న వాకర్సు

మురుగునీటితో అవస్థలు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. పచాయతీలో పరిధిలో వైఎస్ఆర్ కూడలి వద్ద కాలువలు నిర్వహణ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కొద్ది నెలలుగా సర్పంచ్ గాని, పంచాయతీ సిబ్బంది గాని దృష్టి పెట్టకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువలు ఆక్రమణలతో రోడ్లపైకి మురుగునీరు చేరిందని ఆరోపిస్తున్నారు. కాలువల ద్వారా దుర్వాసన రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు